## చౌటచెరువులో భారీ చేపలు లభ్యం



చెరువులో వేసిన వలలో పడిన చేపలు చూయిస్తున్న జాలర్లు

మూసాపేట, అక్టోబర్ 7 : తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకంలో గ్రామాల్లో ఉన్న చెరువులను పూడిక తీయించారు. చెరువుల పూడికతోపాటు కేఎల్ఐ ద్వారా కృష్ణాజలాలు తీసుకొచ్చి పెద్దవాగులో వదిలి చెరువులు నింపుతున్నారు. అదేవిధంగా మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే సంకల్పంతో ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్నారు. మూసాపేట గ్రామానికి చెందిన జలగరి లక్ష్మయ్య మూసాపేట చౌట చెరువులో చేపలు పట్టేందుకు ఏకంగా రూ.24 లక్షలకు పాట పాడాడు. అందులో భాగంగానే ఆయన శనివారం చేపలు పట్టాడు. వలలో కిలో నుంచి 10 కిలోల వరకు ఉండే చేపలు లభ్యమయ్యాయి. వాటిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి విక్రయించనున్నట్లు తెలిపారు. ఇదివరకే ఈ చెరువులో రెండు సార్లు 2 డీసీఎంలకు చేపలు పట్టి విక్రయించుకున్నట్లు తెలిపారు. చెరువులో నీళ్లు తగ్గి ఉంటే మరిన్ని చేపలు లభ్యమయ్యేవని ఆయన చెప్పారు.

## తప్పిన పెను ప్రమాదం

- టైరు పేలి పత్తి మినీ డీసీఎం బోల్తా



రోడ్డుపై బోల్తాపడిన పత్తిలోడ్ మినీ డీసీఎం

దేవరకద్ర, అక్టోబర్ 7: మండలంలోని చౌదర్‌పల్లి సమీపంలో టైరు పేలి మినీ డీసీఎం బోల్తా పడిన ఘటన చోటుచేసుకున్నది. స్థానికుల కథనం ప్రకారం.. మహబుబ్‌నగర్ నుంచి రాయిచూర్‌కు వెళ్తున్న పత్తి లోడ్ డీసీఎం ప్రమాదవశాత్తు టైరు పేలిపోవడంతో అంతరాష్ట్ర రహదారిపై పడిపోయింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్లు క్షేమంగా బయటపడ్డారు. దీంతో ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు డీసీఎంను రోడ్డు పక్కకు తొలగించారు.

## బావిలో పడి యువకుడు మృతి

మల్దకల్, అక్టోబర్ 7 : మండల కేంద్రానికి చెందిన బెక్కు దరేశ్(23) ఈత రాక బావిలో పడి మృతిచెందిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై కల్యాణ్‌కుమార్ కథనం ప్రకారం.. మల్దకల్‌కు చెందిన బెక్కు మల్దన్న కుమారుడు దరేశ్ శనివారం గట్టు తిమ్మన్న బావిలో బట్టలు ఉతకడానికి వెళ్లగా, కాలుజారి బావిలో పడి ఈత రాకపోవడంతో మృతిచెందాడన్నారు. పోస్టుమార్టం నిమిత్తం గద్వాల్ ప్రభుత్వ దవాఖానకు తరలించి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

## వ్యక్తి ఆత్మహత్య

మహబూబ్‌నగర్, అక్టోబర్ 7 : జిల్లా కేంద్రానికి చెందిన ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్యహత్య చసుకున్న ఘటన చోటుచేసుకున్నది. రైల్వే ఎస్సై అక్బర్ తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నర్ జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న లక్ష్మీనాయక్‌తండాకు చెందిన విస్లావత్ రాములు శుక్రవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. రాత్రి 8గంటల సమయంలో కాచిగూడ నుంచి కర్నూల్ వెళ్తున్న హంద్రీ ఎక్స్‌ప్రెస్ రైలుకు ఎదురుగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యువకుడు ఆత్మహత్యాయత్నం

వనపర్తి టౌన్, అక్టోబర్ 7 : జిల్లా కేంద్రంలోని సంతబజారులో ఓ యువకుడు మనోవేదనకు గురై ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. పట్టణ ఎస్సై యుగంధర్ తెలిపిన ప్రకారం.. సంతబజారుకు చెందిన భాస్కర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. తమ కుటుంబ సభ్యులందరూ వనపర్తిలోనే నివాసం ఉంటున్నారు. కొన్ని రోజుల నుంచి హైదరాబాద్‌కు రావాలని కుటుంబ సభ్యులను కోరగా ససేమిరా అంటున్నారని ఎస్సై తెలిపారు. అదేవిధంగా తన సోదరి ప్రేమ వివాహం చేసుకోగా, వారితో సన్నిహితంగా ఉంటున్నారని మనోవేధనకు గురై ఒంటిపై డీజిల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడన్నారు. గమనించిన స్థానికులు వనపర్తి జిల్లా దవాఖానకు తరలించగా, పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్‌కు తరలించారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్న ఎస్సై తెలిపారు.

# గ్రామాలాభివృద్ధికి సర్కారు కృషి.

- ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న
- రూ.45కోట్లతో దుందుభీ వాగుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, ఎమ్మెల్సీ గోరెటి వెంకన్న

కల్వకుర్తి, అక్టోబర్ 7 : గ్రామాల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తున్నదని ఎంపీ రాములు, కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వకుర్తి మండలం రఘుపతిపేట వద్ద దుందుభీ వాగుపై రూ.45కోట్ల అంచనా వ్యయంతో నిర్మించ తలపెట్టిన హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి శనివారం సాయంత్రం ఎమ్మెల్సీ గొరటి వెంకన్న, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌తో కలిసి ఎంపీ రాములు శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రోడ్ల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఇతోధికంగా నిధులు మంజూరు చేస్తుందని చెప్పారు. హైలెవల్ వంతెన నిర్మాణంలో ఈ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు మరింత మెరుగు పడతాయని అన్నారు. రోడ్ల అభివృద్ధితో రవాణా సౌకర్యాలు మెరుగు పడతాయని, గ్రామాలు నగరీకరణ దిశగా పరుగులు పెడతాయని చెప్పారు.ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలందరి సంక్షేమాన్ని కాంక్షిస్తు పాలన సాగిస్తున్నాడని, ప్రజలు పనిచేసే ప్రభుత్వానికి అండగా ఉండాలని వారు పిలుపునిచ్చారు.

**మైనార్టీ కమ్యూనిటీ భవన నిర్మాణానికి భూమిపూజ..**

కల్వకుర్తి మండలం గుండూర్‌లో ఎంపీ రాములు రూ.5లక్షలతో నిర్మించతలపెట్టిన మైనార్టీ కమ్యూనిటీ భవనానికి భూమిపూజ చేశారు. పనులు వేగవంతంగా నాణ్యతగా పూర్తి చేయాలని సూచించారు. అదేవిధంగా జిల్లా పరిషత్ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ మనోహర, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్‌గౌడ్, ఎంపీటీసీ సునిత తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ హ్యాట్రిక్ పక్కా



మాట్లాడుతున్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

నవాబ్‌పేట, అక్టోబర్ 7 : వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ హ్యాట్రిక్ విజయం సాధిస్తుందని మహబూబ్‌నగర్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి దీమా వ్యక్తం చేశారు. నవాబ్‌పేట మండలం గురుకుంటలోని తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపట్టిన సాహోసోపేతమైన నిర్ణయాలే ఆయన విజయానికి సంకేతమని పేర్కొన్నారు. రైతుబంధు ద్వారా రాష్ట్రంలో దళారీ వ్యవస్థ, వ్యాపారుల వడ్డీ దందా పూర్తిగా నశించి పోయిందని పేర్కొన్నారు. రైతుబీమా పథకం నిరుపేదల రైతుల కళ్లల్లో ఆనందం నింపుతోందని వివరించారు. గతంలో రైతు మృతి చెందితే పట్టుమని రూ.10వేలు కూడా వచ్చేవి కావన్నారు. ఇప్పుడు ఎలాంటి పైరవీలు లేకుండానే పది రోజుల్లో బాధిత కుటుంబానికి రూ.5లక్షలు అందజేయడం జరుగుతోందన్నారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో గ్రామాల్లో తాగునీటి కోసం ప్రజలు తంటాలు పడేవారని, సీఎం కేసీఆర్ నట్టింట్లోకి నల్లాను తీసుకొచ్చారన్నారు. చెరువులు, కుంటలను పునరుద్ధరించిన ఘనత ముఖ్యమంత్రికే దక్కుతుందన్నారు. ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కృష్ణారెడ్డి, యాదయ్య, భాస్కర్, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్, మాన్యానాయక్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగులకు ప్రగతి చక్రం అవార్డులు

మహబూబ్‌నగర్‌టౌన్, అక్టోబర్ 7 : మహబూబ్‌నగర్ రీజియన్‌లో వనపర్తి డిపో ఉత్తమ డిపోగా ఎంపికైంది. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని టీఎస్‌ఆర్టీసీ కళాభవన్‌లో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా ఆర్ఎం శ్రీదేవి, వనపర్తి డిపో మేనేజర్ రూ.లక్షా 50వేల క్యాష్ అవార్డు, అభినందన పత్రం అందుకున్నారు. సంస్థ ఇచ్చిన రాష్ట్రస్థాయి రాఖీ, శ్రావణమాసం ఛాలెంజ్‌లో వివిధ విభాగాల నుంచి 16 మంది రాష్ట్రస్థాయి ప్రగతి చక్ర పురస్కారాలు అందుకున్నారు. అచ్చంపేట 1, కల్వకుర్తి 2, మహబూబ్‌నగర్ 6, నాగర్‌కర్నూల్ 1, నారాయణపేట 3, వనపర్తి 3 అవార్డులను అందుకున్నారు. సంస్థ అభ్యున్నతి కోసం అధికారులు, ఉద్యోగులు ఎంతో కృషి చేస్తున్నారని ఆర్ఎం శ్రీదేవి తెలిపారు.

# మలబార్‌గోల్డ్ నెక్లెస్ మేళా

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబర్ 7 : జిల్లా కేంద్రంలోని మలబార్ గోల్డ్, డైమండ్స్ షోరూంలో శనివారం మలబార్‌గోల్డ్ నెక్లెస్ మేళాను గిరిజామాత ఉమెన్స్ మెడికల్ క్లబ్ మెంబర్స్ పుణ్యవతి, చంద్రప్రద, సౌజన్య, నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ శరత్, మేనేజర్ సయ్యద్ ఇమ్రాన్ మాట్లాడుతూ.. నెక్లెస్ మేళా ప్రదర్శన అక్టోబర్ 7 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. మా స్టోర్‌లో పాత బంగారు మార్పిడికి ఎటువంటి తరుగు ఉండదన్నారు. వినియోగదారులకు అందించే వస్తువులో ఖచ్చితమైన తయారు ధర, రాళ్ల బరువు, నికర బరువు, ఆభరణాలకు జీవితకాల ఉచిత నిర్వహణ, బాధ్యతాయుతమైన మూలాల నుంచి బంగారు సేకరణ వంటి వాగ్ధానాలను అందిస్తుందన్నారు. సంస్థ తమ వార్షిక ఆదాయం నుంచి ఉచిత విద్య, పేదలకు గృహ నిర్మాణం, మహిళా సాధికారత, పర్యావరణ పరిరక్షణ విభాగాల్లో తమ వంతు సహాయం అందిస్తుందని తెలిపారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి

రాజాపూర్, అక్టోబర్ 7 : గుర్తు తెలియని వ్యక్తి స్కూటీపై శనివారం షాద్‌నగర్ నుంచి జడ్చర్ల వైపు వస్తుండగా మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందినట్లు ఎస్సై వెంకట్‌రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జడ్చర్ల దవఖానకు తరలించామన్నారు.

# ఇద్దరు విద్యార్థులపై దాడి

- సెల్‌ఫోన్లు చోరీ చేశారనే అనుమానంతో చితక్కొట్టిన తోటి విద్యార్థులు
- గురుకుల కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

కల్వకుర్తి, అక్టోబర్ 7 : సెల్‌ఫోన్లు చోరీ చేశారనే అనుమానంతో ఇద్దరు విద్యార్థులను తోటి విద్యార్థులు 8మంది చితకబాదిన ఘటన కల్వకుర్తి మున్సిపాలిటీ జేపీ నగర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకున్నది. కారుకొండ గ్రామానికి చెందిన మిద్దె నవీన్, కుమ్మెర గ్రామానికి చెందిన పల్లె సిద్దార్థ, గద్వాలకు చెందిన జయంత్ జేపీనగర్ ఎస్సీ గురుకుల కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం సాయంత్రం ఇద్దరు విద్యార్థులకు చెందిన సెల్‌ఫోన్లు కనిపించకపోవడంతో ఎరుకలి వారి వద్దకు వెళ్లి ఫోన్ల కోసం గద్దె చెప్పించుకున్నారు. గద్దె చెప్పిన వారు ఇచ్చిన మూఢ నమ్మకపు సమాచారంతో 8మంది ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థులు అర్ధరాత్రి దాటిన తర్వాత నవీన్, సిద్దార్థ, జయంత్‌లను పాఠశాల మైదానంలోకి తీసుకెళ్లారు. చోరీ చేసిన సెల్‌ఫోన్లు ఇవ్వాలని బెదిరించారు. తాము ఫోన్లు తీసుకోలేదని సదరు విద్యార్థులు చెప్పడంతో ఆగ్రహానికి గురైన 8మంది విద్యార్థులు నవీన్, సిద్దార్థలను కానుగు బరుగులతో దాడిచేసి విపరీతంగా కొట్టారు. జయంత్‌ను మాత్రం బెదిరించారు. తీవ్రంగా దెబ్బలు తిన్న విద్యార్థులు అదే రాత్రి తమ తల్లిదండ్రులకు ఫోన్‌లో సమాచారం అందించారు. బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్‌సీవో వనజకు సమాచారం ఇచ్చి జేపీ నగర్ పాఠశాలకు వచ్చి ఆందోళనకు దిగారు. ఆర్‌సీవో, ప్రిన్సిపాల్‌పై బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరంతరం కళాశాలలో ఉండాల్సిన ప్రిన్సిపాల్ సాయంత్రం కాగానే హైదరాబాద్ వెళ్లి, ఉదయం వస్తున్నాడని విద్యార్థులు తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చి పోతుండటంతో విద్యార్థులు క్రమశిక్షణ తప్పుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో సెల్‌ఫోన్లు అందుబాటులో ఉండటం నిబంధలనకు విరుద్ధమని, ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని మండిపడుతున్నారు. ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి నిర్లక్ష్యమైన వాతావరణంలో తమ పిల్లల చదువులు ఎలా సాగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు పశ్నించారు.

## దాడి చేసిన విద్యార్థులకు కౌన్సెలింగ్

దాడి చేసిన విద్యార్థులపై పోలీస్ కేసులు నమోదు చేయాలని బాధిత విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. దాడి చేసిన విద్యార్థుల తల్లిదండ్రులు బాధిత విద్యార్థుల తల్లిదండ్రుల కాళ్లు పట్టుకుని వేడుకోవడంతో వెనక్కి తగ్గారు. మరోసారి ఇలాంటి తప్పులు చేయమని రాయించుకున్నారు. బాధిత విద్యార్థులను కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆర్‌సీవోతోపాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు బాధిత విద్యార్థి కుటుంబాలకు కాగితాలు రాసి ఇచ్చారు. అనంతరం దాడి చేసిన విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.



ఆర్‌సీవో ఎదుట బాధిత విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులు